క్లుప్తంగా

ఈ-శ్రమ్ కార్మికులకు వరం



ఈ-శ్రమ్ కార్డును అందజేస్తున్న కార్మికశాఖ అధికారులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన అసంఘటిత, వలస కార్మికులకు పలు ప్రయోజనాలు కల్పిస్తున్నామని జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ శ్రీకాంత్ నాయక్ తెలిపారు. మంగళవారం కడప నగరంలోని మట్టిపెద్దపులి వద్ద స్కూటర్ మెకానిక్ జీకే ఖాదర్‌బాషకు ఈ-శ్రమ్ కార్డును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ నాయక్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కూలీలు, చేతి వృత్తిపనివారు, ఆశా, అంగన్వాడీ వర్కర్లు, మత్స్యకారులు 16-59 సంవత్సరాల మధ్య వయస్సుగల వారు ఇందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకోని వారు వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ అధికారులు, స్కూటర్ మెకానిక్‌లు పాల్గొన్నారు.

అల్మార బహూకరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు 118వ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా కడప నగరం పాత బస్టాండు సమీపంలో ఉన్న శ్రీ గాలిదేవర ఆంజనేయస్వామి ఆలయానికి కెనరా బ్యాంకు అధికారులు గోద్రేజ్ అల్మారాను మంగళవారం బహూకరించారు. అనంతరం అంధుల పాఠశాలకు ఇన్వర్టర్, సీలింగ్ ఫ్యాన్లు, డ్రాయింగ్ షీట్లు, బ్రెయిలీ లిపితో కూడి సామాగ్రిని అందజేశారు. బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీమోహన్, హెడ్మాస్టర్ అబ్దుల్ మునాఫ్, డివిజనల్ మేనేజర్ ఏవీ రాజశేఖర్, మేనేజర్లు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమవంతుగా తోడ్పాటు అందించాలని జిల్లా కార్మికశాఖ అధికారి శ్రీకాంత్‌నాయక్ తెలిపారు. మంగళవారం పలు దుకాణాలు, సంస్థల్లో రెస్క్యూ టీమ్ సభ్యులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చిన్న, పెద్ద ఫ్యాక్టరీలు, డాబాలు, పరిశ్రమలు, హోటళ్లు, దుకాణాలు, గనులు, ఇటుక బట్టీలు తదితర వాటిలో బాల కార్మికులను పనిలో పెట్టుకోరాదన్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులందరూ దుకాణాలను తనిఖీ చేస్తారని, బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవన్నారు.

నేటి నుంచి శిక్షణ

కడప అగ్రికల్చర్: కడప నగర శివార్లలోని ఊటుకూరు ఏరువాక కేంద్రంలో ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు చిరుధాన్యాలకు విలువ జోడింపు అనే అంశంపై రైతులకు, యువత, నిరుద్యోగులకు నైపుణ్యత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏరువాక కేంద్ర సమన్వయ కర్త మురళీకృష్ణ తెలిపారు. రైతులు, యువత, నిరుద్యోగులు హాజరుకావాలని కోరారు.

దత్తత ఓ వరం లాంటిది



దత్తతపై అవగాహన కల్పిస్తున్న శిశు గృహ మేనేజర్ కుమారి

కడప కోటిరెడ్డిసర్కిల్ : దత్తత ఓ వరం లాంటిదని శిశు గృహ మేనేజర్ కుమారి తెలిపారు. మంగళవారం అంతర్జాతీయ దత్తత మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా మరియాపురంలోని మల్టీ పర్పస్ సోషల్ సర్వీసు సొసైటీలో ఆశా కార్యకర్తలు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడు తూ పిల్లలు లేని వారు దత్తత తీసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దత్తత పొందాలనుకునేవారు శిశు గృహలోగానీ, జిల్లా స్త్రీ శిశుసంక్షేమ సాధికారత అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. జిల్లా సోషల్ వర్కర్ పద్మిని, డీఈఎంఓ భారతి, పీహెచ్‌టీ రూతు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్ / కడప ఎడ్యుకేషన్: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌ఓ రాయలసీమ కన్వీనర్ కత్తి ఓబులేశు కోరారు. విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జీపు జాతా, హాస్టల్ నిద్ర కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం కడపలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షులు బందెల ఓబులేశు, టీఆర్‌ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇండ్ల జయరాజు, డీఎస్‌వైఏ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు.

అన్నదానం

కడప కార్పొరేషన్: కార్తీక మాసం సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం. చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పరిషత్ ప్రాంగణంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇందుకు సహకరించిన తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపీకృష్ణ, సూర్య డెవలపర్స్ అధినేత కె. సురేంద్రనాథ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర భవిష్యత్ కోసం జగనే మళ్లీ రావాలి

– ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: రాష్ట్ర భవిష్యత్ కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా రావాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక 41వ డివిజన్‌లో ఆయన పాల్గొని వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్టికను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఏవైతే హామీలు ఇచ్చారో అవన్నీ తు. చ తప్పకుండా అమలు చేశారని తెలిపారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా, అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలను పేద ప్రజల ఇంటికే చేర్చారన్నారు. ఈ సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, 41వ డివిజన్ ఇన్‌చార్జి జమాల్‌వలీ, డా. మురాద్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్‌లో...

కడప నగరంలోని 14వ డివిజన్ ప్రకాష్ నగర్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూడలిలో వైఎస్ఆర్ సీపీ జెండాను ఎగురవేసి, వార్డు సచివాలయం వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్టికను ప్రదర్శించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, బుక్‌లెట్లు అందజేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు కలిగిన మేలును వివరించారు. ఈ సందర్భంగా క్లస్టర్ పార్టీ అధ్యక్షుడు పి. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 14వ డివిజన్‌లో వివిధ పథకాల ద్వారా సుమారు రూ.12కోట్లను డీబీటీ ద్వారా ప్రజల ఖాతాలకు జమ చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలంతా జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, 14వ డివిజన్ కార్పొరేటర్ కె. బాబు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

రామక్రిష్ణ నగర్‌లో....

కడప నగరంలోని రామక్రిష్ణ నగర్‌లో 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు సభ్యులు ఎస్. యానాదయ్య, క్లస్టర్ పార్టీ అధ్యక్షుడు తోట క్రిష్ణ, జేసీఎస్ ఇన్‌చార్జి మల్లికార్జునలు వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లేను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబుకు ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచన రాలేదన్నారు. గత ప్రభుత్వాలకు, జగన్ ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 4వ డివిజన్ ఇన్‌చార్జి ఆర్‌వీ రమణ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

– కడప నగరంలోని 32వ డివిజన్‌లో కార్పొరేటర్ జఫ్రుల్లా ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నార్త్ జోన్ జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఎస్ఎండీ షఫీ, క్లస్టర్ అధ్యక్షుడు హరూన్‌బాబులు ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల వల్ల ప్రజలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



41వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



4వ డివిజన్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డిసెంబర్ 9న లోక్ అదాలత్

కడప అర్బన్: జిల్లాలో డిసెంబర్ 9న ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్‌ఎస్‌ఏ చైర్మన్ శ్రీదేవి, డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, జడ్జి ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలియజేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

యువతిపై దాడి

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏ-1 నగర్‌లో నివాసం వుంటున్న ముసాన్ అనే యువతిపై తాహీర్‌హుసేన్ అనే వ్యక్తి ఆమె ముసుగును తొలగించి ముక్కుపై దాడి చేశాడు. తరువాత కట్టెతో కొట్టాడు. తనపై అనవసరంగా దాడి చేసి గాయపరిచాడని యువతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయరాముడు తెలియజేశారు.

అంతర్ ముఖ సిద్ధయోగం

కడప అర్బన్: నబీకోటలోని సాయిబాబా గుడిలో మంగళవారం సిద్ధయోగి డాక్టర్ స్వామి అంతర్‌ముఖానంద స్వామి అంతర్ ముఖ సిద్ధయోగంను ఉపదేశించారు. యోగం ద్వారా కలిగే ఉపయోగాలు వివరించారు.

బస్సుయాత్రను జయప్రదం చేయాలి

కడప కార్పొరేషన్: కడప అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈనెల 23వ తేదీ నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు జాషువా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యత ఇచ్చి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించడం జరిగిందన్నారు. వైఎస్సార్‌టీయూసీ నగర అధ్యక్షుడు నాగరాజు, కో ఆప్షన్ సభ్యురాలు బండి మరియలు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న వైఎస్ఆర్‌టీయూసీ నాయకులు

ఉర్దూలో శిక్షణ ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో తలపెట్టిన ఎల్ఐపి శిక్షణను ఉర్దూ ఉపాధ్యాయులకు ఉర్దూభాషలోనే ఇవ్వాలని రూట వ్యవస్థాపకులు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి అయూబ్ కోరారు. ఈ విషయమై మంగళవారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాషను కడపలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈసందర్భంగా అయూబ్ మాట్లాడుతూ ఉర్దూ ఉపాధ్యాయులకు తెలుగు మాధ్యమంలో శిక్షణ ఇవ్వటం వలన ఎటువంటి ప్రయోజనం కలగడం లేదన్నారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం ఫోన్‌లో రాష్ట్ర విద్యాశాఖ అధికారులతో చర్చించారు.



డిప్యూటీ సీఎంకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న రూట నాయకులు

సానుకూల దృక్పథంతో విజయం



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా

వైవీయూ : సానుకూల దృక్పథంతో చక్కటి విజయాలు సాధ్యమవుతాయని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా పేర్కొన్నారు. మంగళవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'వ్యక్తిత్వ వికాసం-నైపుణ్యాభివృద్ధిపై' ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు బి. సుబ్రమణ్యం మాట్లాడుతూ లక్ష్యాన్ని సాధించడానికి కావలసిన పట్టుదల, మనోధైర్యం, బాధ్యత, నిబద్ధత గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పోటీ పరీక్షల్లోను, నిజజీవితంలో విజేతలుగా నిలిచిన వ్యక్తుల గురించి ఉదహరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. జి. విజయలక్ష్మీదేవి, డా. గురుమోహన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

పరామర్శ

కడప అర్బన్: కడప కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో వున్న టీడీపీ మాజీ ఎమ్మెల్సీ ఎం. రవీంద్రనాథ్‌రెడ్డి (బీటెక్ రవి)ని ములాఖత్‌లో భాగంగా బీజేపీ రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ కలిసి పరామర్శించారు. ఇదే కారాగారంలో ఉన్న ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌ఛార్జ్ ప్రవీణ్‌కుమార్ రెడ్డిని కూడా ఆయన పరామర్శించారు.

స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి



కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప కార్పొరేషన్: కడప నగరాభివృద్ధిలో భాగంగా కొత్తగా నిర్మిస్తున్న కూడళ్లలో స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు, ఎస్ఎండీ యూనస్ కోరారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో వారు నగరపాలక కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలో ట్రాఫిక్‌కు తగినట్లు రోడ్ల విస్తరణ చేయడం అభినందనీయమన్నారు. అయితే ఆ కూడళ్లలో దేశ స్వాతంత్య్రం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి అమరులైన వారి విగ్రహాలను ఏర్పాటు చేస్తే భావి భారత పౌరులకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు.

యువత ఓటర్లుగా నమోదు కావాలి

– ఈఆర్ఓ మధుసూదన్





కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఈఆర్ఓ మధుసూదన్

కడప సెవెన్‌రోడ్స్ : జనవరి 1వ తేదికి 18 సంవత్సరాలు నిండే ప్రతి ఒక్కరూ డిసెంబరు 9వ తేదీలోపు ఓటరుగా నమోదు కావాలని కడప అసెంబ్లీ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మధుసూదన్ కోరారు. మంగళవారం కడప కోటిరెడ్డి ఉమెన్స్ కళాశాలలో స్వీప్ కార్యక్రమం కింద విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫారం-6 నింపి ఆన్‌లైన్‌లో లేదా బూత్ లెవెల్ అధికారి వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈఆర్ఓ లేదా బీఎల్ఓ వద్ద అన్ని రకాల దరఖాస్తు ఫారాలు లభిస్తాయని చెప్పారు. అలాగే డబ్ల్యు. డబ్ల్యు. డబ్ల్యు .ఈసీఐ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి ఆయా ఫారాలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఓటరు హెల్ప్‌లైన్ అప్ ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటరు నమోదుకు ఫారం-6 పూరించి ఫోటో అతికించి వయస్సు, చిరునామా ధృవీకరణ పత్రాలు జతపరచాలని వివరించారు. ఓటరు నమోదు కేంద్రంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఓటర్ల జాబితాలో ఏవైనా సవరణలు చేయాలనుకుంటే ఫారం-8 సమర్పించాలన్నారు. ఒకే నియోజకవర్గంలోని ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి చిరునామా మార్పు కోసం సంబంధిత ఫారం-8ఏను క్లిక్ చేసి వివరాలు నింపి దరఖాస్తు చేయాలన్నారు. మరణించిన వారి ఓటును తొలగించేందుకు ఫారం-7 నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్ఓ శివ రామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాహుకాల పూజలు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూల మూర్తిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు పూజా విధానాన్ని వివరించారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.



ప్రతి కార్డుదారుకు మూడు కిలోల ఉచిత రాగులు

– జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రతి రేషన్‌కార్డు దారులకు డిసెంబరు నెలలో మూడు కిలోల ఉచిత రాగులు (బియ్యానికి బదులు) ఇస్తామని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 366 ఎండీయూల ద్వారా 5,84,592 కార్డులకు గాను 17,58,208 మందికి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తామన్నారు. రాగుల్లో మంచి పోషక విలువలు ఉన్నాయని, ఇవి ఎముకల వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయన్నారు. డయాబెటిక్ రోగులు కూడా రాగులను ఉపయోగించుకోవాలన్నారు. రాగులతోపాటు సార్టెక్స్ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఉచితంగా అందిస్తామన్నారు. కందిపప్పు కార్డుకు కిలో రూ. 67 చొప్పున ఇస్తామన్నారు. చక్కెర అర కిలో రూ. 17తో అందజేస్తామన్నారు. అర్బన్ ప్రాంతాల్లో గోధుమపిండి కార్డుకు కిలో రూ. 16 చొప్పున పంపిణీ చేస్తామన్నారు. నవంబరు నెలలో 88.91 శాతం కార్డులకు రేషన్ పంపిణీ చేశామని పేర్కొన్నారు. కార్డుదారులు ఎవరైనా రేషన్ సరుకులు అమ్ముకోరాదని కోరారు.

బహుమతి ప్రదానం

కడప కార్పొరేషన్: కడప నగరంలోని అమోఘ హోండా షోరూం నందు దసరా, దీపావళి సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో పాల్గొన్న వారిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి మంగళవారం బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి అమోఘ హోండా మేనేజింగ్ డైరెక్టర్ సుంకర ఐశ్వర్య హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి పొందిన ఎం. కళ్యాణ్ బాబుకు రిఫ్రిజిరేటర్, రెండో బహుమతి పొందిన షేక్ యాస్మిన్ బేగమ్‌కు వాషింగ్ మెషీన్, మూడో బహుమతి పొందిన చిన్నక్రిష్ణయ్యకు గీజర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో షోరూం జనరల్ మేనేజర్ మల్లికార్జున, సేల్స్ మేనేజర్ ఫ్రాన్సిస్, సిబ్బంది పాల్గొన్నారు.



లక్కీ డ్రా విజేతలకు బహుమతి ఇస్తున్న అమోఘా హోండా షోరూం ఎండీ సుంకర ఐశ్వర్య

మాతృ మరణాల నివారణకు గట్టి చర్యలు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో మాతృ మరణాల నివారణకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఓఎస్‌డీ రఘునాథ్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఆగస్టు నుంచి ఖాజీపేట పీహెచ్‌సీ, తాళ్లపల్లె, నగరిగుట్ట, శ్రీనివాసనగర్, ఎర్రముక్కపల్లెల్లో జరిగిన ఐదు మాతృ మరణాలకు శాస్త్రీయ కారణాలను గుర్తించాలన్నారు. గర్భస్థ, ప్రసవ, బాలింత సమయాల్లో ఆస్పత్రులలో అందించిన సేవలను, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో మాతృ మరణాలు జరగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌ఓ ఉమామహేశ్వరకుమార్, రిమ్స్ పర్యవేక్షణాధికారి రమాదేవి, ప్రసూతి సేవల విభాగాధిపతి లక్ష్మిసుశీల, ప్రైవేటు నర్సింగ్ హోమ్‌ల గైనకాలజిస్టులు, పీహెచ్‌సీ అధికారులు పాల్గొన్నారు.

నిర్దిష్ట సమయంలోనే లక్ష్యాలను గుర్తించాలి

వైవీయూ : నిర్దిష్ట సమయంలోనే సైనికులు వారికి కేటాయించిన లక్ష్యాలను గుర్తించినప్పుడే ప్రత్యర్థులపై విజయం సాధ్యమవుతుందని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా పేర్కొన్నారు. కడప ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న సీఏటీసీ-12 క్యాంపులో భాగంగా మంగళవారం ఎన్‌సీసీ కేడెట్స్‌కు మ్యాప్ రీడింగ్‌పై శిక్షణ ఇచ్చారు. క్యాంపు డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్. నీలయ్య మాట్లాడుతూ లక్ష్యాన్ని చేరుకునే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సులువుగా చేరుకునేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు డా. మహేష్, రాజు, పరేడ్ శిక్షకులు సుబేదార్ అశోక్, బిష్ణోయ్, సీఎల్ రెడ్డి, జగదీష్, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో ప్లాస్టిక్ వినియోగం వద్దు



శంకర్ బాలాజీ

కడప కల్చరల్ : కార్తీక మాసం సందర్భంగా జిల్లా అంతటా శివాలయాల్లో పూజోత్సవాలు నిర్వహిస్తారని, వీటిలో భక్తులు వీలైనంత వరకు ప్లాస్టిక్ సామాగ్రిని వినియోగించవద్దని జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సి.శంకర్ బాలాజీ కోరారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ కార్తీక సోమవారాలు, పౌర్ణమి సందర్భంగా భక్తులు దీపాలు వెలిగించేందుకు, పూజలు నిర్వహించేందుకు భారీ సంఖ్యలో దేవాలయాలకు వస్తారని, పూజా సామాగ్రిని ప్లాస్టిక్ కవర్లలో కాకుండా స్టీలు లేదా కాటన్ సంచులలో తెచ్చుకోవాలన్నారు. అన్నదానాలలో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు వాడవద్దని, వ్యర్థాలను ఒకచోట శుభ్రం చేసేందుకు వీలుగా పడవేయాలని కోరారు. ఆలయ పరిసరాల్లో ఎలాంటి పరిస్థితుల్లోనూ నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వాడరాదని సూచించారు. జిల్లాలోని అన్ని దేవాలయాల ఈఓలు, మేనేజర్లు, సిబ్బందికి ఈ మేరకు ఆదేశాలు జారీ చేస్తున్నామని తెలిపారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

కడప సెవెన్‌రోడ్స్ : మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు మనోహర్ మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగాల పర్మినెంట్, హెల్త్, రిస్క్ అలవెన్స్‌లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ డివిజనల్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, జిల్లా రైతు సంఘం కార్యదర్శి దస్తగిరిరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలే సాగు చేయాలి



మినుము పంట పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: కడప మండల పరిధిలో రబీ సీజన్‌లో బోరుబావులు, చెరువుల కింద రైతులు ఆరుతడి పంటలను మాత్రమే సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పాత కడప, చౌటపల్లెలో సాగు చేసిన వరి, మినుము పంటలను పరిశీలించారు. ఇందులో వరిలో వచ్చే కాండం తొలుచుపురుగు, ఆకు చుట్టు పురుగు నివారణకు రైతులు కార్టాప్ హైడ్రో క్లోరైడ్‌ను 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. అలాగే దోమ నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 1 ఎంఎల్‌ను లీటరు నీటికి లేదా థయామిథోక్సామ్‌ను 0.5 గ్రాములను ఒక లీటరు నీటికి లేదా బుప్రోఫెజిన్‌ను 1.6 మిల్లీలీటర్లను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓఓలు పావని, మోహరాజ్‌లతోపాటు రైతులు పాల్గొన్నారు.

24 నుంచి సమ్మేటివ్ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత , ఉన్నత పాఠశాలలకు ఈనెల 24వ తేదీ నుంచి డిసెంబర్ 8వ తేదీ వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు ఇప్పటికే అన్ని మండలాల కేంద్రాలోని ఎమ్మార్సీలకు చేరవేయడం జరిగిందన్నారు. ప్రధానోపాధ్యాయలు అందరూ 22వ తేదీ నుంచి వారి పాఠశాలలకు సంబంధించిన బండిల్స్‌ను తీసుకుని అన్ని క్లాసులు, సబ్జెక్టుల ప్రశ్నాపత్రాలు సరిచూసుకుని ట్రంకు పెట్టిల్లో భద్ర పరచుకోవాలని తెలిపారు. తదుపరి టైమ్ టేబుల్ ప్రకారం ఎమ్మార్సీ కేంద్రాల నుంచి పరీక్షకు గంట ముందు మాత్రమే పరీక్ష ప్రశ్నాపత్రాలను తీసుకెళ్లాలని డీఈఓ తెలిపారు.